క్లుప్తంగా

మణికంఠకు పంచామృతాభిషేకాలు



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. పూర్ణ దేవి, పుష్కల దేవి, శాస్త, అయ్యప్పస్వామికి విశేష పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు మాలధారణ చేసి మండల దీక్షలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త, గురుస్వామి వాకా చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రసాద వితరణ చేశారు.

శాస్త్రోక్తంగా భగలాముఖి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: నాయుడుతోట పద్మనాభనగర్ సమీపంలోని ఆదిశక్తి నాగ మానసాదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. వాస్తు సిద్ధాంతి ప్రసాద్ ఆధ్వర్యంలో భగలాముఖి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అప్పన్న సన్నిధిలో మంత్రి కొల్లు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మంత్రి కొల్లు రవీంద్ర

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు ఉన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు వినతి



తహసీల్దార్ అంబేడ్కర్‌కు వినతి పత్రం అందిస్తున్న రామారావు

పరవాడ: మండలంలోనిభర్నికం గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన చిప్పాడ రామారావు పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్‌ను కోరారు. భరిణికం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ మేరకు వినతిపత్రం అందించారు. భర్నికం రెవెన్యూ పరిధిలో నీటి ప్రవాహ భూములు, వాగులు, గుట్టలు, పంట కాలువలు, ప్రభుత్వ రహదారులు, సీలింగ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. ఈ భూములను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో కోరారు.

దివ్యాంగుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు



దివ్యాంగులకు స్వీట్లు అందించిన ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎం పాత్ర, కుటుంబ సభ్యులు

పరవాడ: తన కుమారుడి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని సింహాద్రి ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) బి.బి.పాత్ర స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం బాగోగుల గురించి భవిత సెంటర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన భార్య, కుమారుడు సోహమ్‌పాత్రలు దివ్యాంగ విద్యార్థులతో గడిపారు. భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

దీపావళి.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. వెలుగుల పండగకు పెందుర్తి నియోజకవర్గంలోని మార్కెట్లు సిద్ధమయ్యాయి. పూజాసామగ్రి, బాణసంచా కొనుగోళ్లతో సందడి మొదలయింది. పలు చోట్ల బాణసంచా దుకాణాలు వెలిశాయి. నెలాఖరు కావడం, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరి ప్రతి నెలా ఏదో ఓ సంక్షేమ పథకం రూపంలో లబ్ధి చేకూరే పరిస్థితి లేక ఈసారి దీపావళి కాస్త భారంగానే మారిందని చెప్పుకోవచ్చు.

చీకటి వెలుగుల దీపావళి





పెందుర్తిలో బాణాసంచా అమ్మకాలు

- పండగకు సిద్ధమైన పెందుర్తి మార్కెట్లు
- పూజాసామగ్రి ధరలకు రెక్కలు
- మండుతున్న బాణసంచా ధరలు
- నెలాఖరు కావడంతో పండగ ఖర్చుపై తీవ్ర ప్రభావం

పెందుర్తి: దీపావళి వేడుకలకు నియోజకవర్గం సిద్ధమయింది. రకరకాల మట్టి ప్రమిదలు, డిజైనర్ ప్రమిదలు, వివిధ రకాల సీరియల్ లైటింగ్స్ కొనుగోలుదార్లతో మార్కెట్‌కు శోభ మొదలయింది. పూజాసామగ్రి, బాణసంచా అమ్మకందార్లతో ప్రధాన కూడళ్లు సందడిగా కనిపిస్తున్నాయి. దివ్వెలు కొట్టేందుకు చెరకు గడలు, గోగు పుల్లల అమ్మకాలు ఊపందుకున్నాయి. రెండు రోజుల ముందు నుంచే మట్టి ప్రమిదలు మార్కెట్లను ముంచెత్తాయి. బాణసంచా ధరలు కాల్చకుండానే.. తారాజువ్వల మాదిరి నింగినంటుతున్నాయని కొనుగోలుదార్లు చెప్తున్నారు.

వాతావరణం అనుకూలం

గతేడాది దీపావళి ముందు రోజు తుపాను హెచ్చరికలతో బాణసంచా సామగ్రి అమ్ముడుపోక వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ఆ లోటును ఈ ఏడాది భర్తీ చేసుకుందామని అమ్మకాలకు సిద్ధమయ్యారు. మరోవైపు చైనా టపాసులు కూడా వీరికి ఇబ్బందికరంగా మారుతున్నాయి. కొందరు వ్యాపారులు బ్లాక్‌లో చైనా టపాసులు తీసుకురావడంతో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ధరలు పెరిగినా పిల్లల కోసం బాణసంచా సామగ్రి కొనుగోలు చేయక తప్పని స్థితి. వ్యాపారులు ఎంత గొప్ప ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించినా రూ.ఐదారు వేలు పెడితేనే గాని ఇంటిల్లపాదికీ సరిపడా టపాసులు వచ్చే పరిస్థితిలేదని కొనుగోలుదారులు చెప్తున్నారు.

నింగినంటుతున్న ధరలు

నియోజకవర్గ పరిధిలో మంగళవారం నుంచే పలు చోట్ల బాణసంచా విక్రయాలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో మందుగుండు సామగ్రి విక్రయాలు ప్రారంభంకానున్నాయి. అయితే బాణసంచా ధరలు కొనుగోలుదార్లను భయపెడుతున్నాయి. గతంలో రూ.2–3 వేలకు వచ్చే సామగ్రి ఈసారి రూ.5–6 వేలు పెట్టినా వచ్చేలా కనిపించట్లేదని కొనుగోలుదార్లు చెప్తున్నారు. మరోవైపు నిత్యవసరాల ధరలు కూడా ఆకాశాన్ని తాకాయి. దీనికి తోడు నెలాఖరు కావడంతో ఈ పండగను ఎంత తక్కువలో వీలైతే అంత తక్కువ మొత్తంలో పూర్తి కానిచ్చేయాలనే ఆలోచనలోనే ఎక్కువ మంది ఉన్నారు.

కూటమి పాలనలో బతుకులు కుదేలు

ఈ ఏడాది దీపావళి నెలలో చివరి రోజున పడటంతో ఒకటీ అరా కేంద్ర ప్రభుత్వ సంస్థలు మినహా మరెవరికీ ముందుగా జీతాలందే పరిస్థితి లేదు. జీతాలొచ్చేకా ఇచ్చేద్దామని.. అప్పు చేయాలనుకున్నా.. ఇచ్చేవారూ కరువాయే..! ఎందుకంటే అందరికీ నెలాఖరే. దీనికి తోడు కూటమి ప్రభుత్వం వచ్చాక పేద, దిగువ మధ్యతరగతి ప్రజల ఉపాధి అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. ఇసుక కొరతతో నిర్మాణ పనులు కనీస స్థాయిలో కూడా దొరకని దుస్థితి. దీనికి తోడు ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ఊసే లేదు. గత ప్రభుత్వంలోనైతే ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ పథకం రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో ఈ దీపావళి భారంగా మారిందని పలువురు చెప్తున్నారు.



పాపయ్యరాజుపాలెంలో సిద్ధమవుతున్న బాణసంచా దుకాణాలు



పెందుర్తిలో మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కొనకుండానే పేలుతున్నాయి



దీపావళి అంటే ఇంటిల్లపాదీ ఆనందంగా చేసుకుంటాం. రోజంతా సందడిగా గడుపుతాం. సాయంత్రం మతాబులతో సందడే సందడి. మార్కెట్‌లో బాణసంచా ధరలు చూస్తే.. కొనకుండానే పేలేలా ఉన్నాయి. రూ.5 వేలు పెడితే గానీ సరిపడా సామగ్రి రాని పరిస్థితి. నిత్యావసర సరకుల ధరలు కూడా ఇబ్బందికరంగా మారాయి. రానున్న రోజుల్లో మధ్యతరగతి ప్రజలం పండగలు చేసుకోలేమేమో..!

– శరగడం తులసి, పెందుర్తి

భారమైన పండగ



ఈ ఏడాది దీపావళి పండగ చేసుకునేలా లేదు. పెనుభారంగా మారింది. పటాసుల దగ్గర నుంచి నిత్యావసరాలు, పూజా సామగ్రి ఇలా అన్ని ధరలూ విపరీతంగా పెరిగాయి. పైగా నెలాఖరు కావడంతో చేతిలో చాలినన్ని డబ్బుల్లేక మాలాంటి మధ్యతరగతి కుటుంబాల్లో అయోమయం నెలకొంది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు రాకపోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది.

– సిరిమల్ల గణేష్, పెందుర్తి

అప్రమత్తంగా ఉండాలి



దీపావళి ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలి. నిబంధనల మేరకు ఏర్పాటైన దుకాణాలకు మాత్రమే అనుమతి ఇచ్చాం. ప్రతీ దుకాణం వద్ద ఖచ్చితంగా నీరు, ఇసుక పెట్టుకోవాలని దుకాణదారులకు సూచించాం. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. దుకాణదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి బాణాసంచా వినియోగించాలి. పిల్లలు జాగ్రత్త.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

విద్యా దీవెన, వసతి దీవెన చెల్లించాలని వినతి

పరవాడ: పెండింగులో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధుల్ని వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ సభ్యుడు రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పరవాడ డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతేడాది నుంచి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇప్పటికీ చెల్లించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. మండలంలోని ప్రవేట్ ఐటీఐ కళాశాలలు, అనకాపల్లి, గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లోని ప్రవేట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వందల మంది విద్యార్థులు చదువుతున్నారని, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తున్నా ఇంతవరకూ ఫీజులు చెల్లించకపోవడం దారుణమన్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకొస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన ఇస్తుందన్న ధైర్యంతో ఉన్నత చదువులకు తమ పిల్లల్ని పంపిన తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వ తీరుతో ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధి తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు గణన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెందుర్తి: 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా పెందుర్తి మండలం రాంపురంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాడి రైతులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణ రావు, ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, పశువైద్య శాఖ అధికారులు ఎం.సుకన్య, ఎ.నాగమణి, నాయకులు కన్నయ్య, బంగారునాయుడు పాల్గొన్నారు.

సర్దార్ పటేల్ ఆశయ సాధనకు యువత కృషి

సబ్బవరం: ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా నేటి యువత దేశ సమగ్రతకు కృషి చేయాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో జాతీయ సమగ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకనును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులంతా భారతదేశ సమగ్రతను కాపాడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. కళాశాల నుంచి సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి దేశ సమగ్రతా నినాదాలు చేశారు.



ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, డాక్టర్ టీఎంవీ నివేదిత, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎంపీ రామకృష్ణ, జాతీయ సేవా పథకం వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రసాదాల తయారీలో నాణ్యత తప్పనిసరి

- సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు
- ప్రసాదాల తయారీశాల, విక్రయశాలలో ఆకస్మిక తనిఖీలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రసాదాల తయారీలో నాణ్యతని ఖచ్చితంగా పాటించాలని, అందులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు హెచ్చరించారు. సింహగిరిపై అన్నప్రసాద భవనంలో ఉన్న ప్రసాదాల తయారీ కేంద్రాన్ని, రాజగోపురం వద్ద ఉన్న ప్రసాదాల విక్రయశాలని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసాదాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం దేవస్థానంలో పులిహోర, లడ్డు ప్రసాదాలను భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తార, వాటిని నాణ్యతగా తయారుచేసి అందించాల్సిన బాధ్యత తమందరిపైనా ఉందన్నారు.



ప్రసాదాల విక్రయశాలలో ఈవో త్రినాథరావు

దూర ప్రాంతాలకి లడ్డులను పెద్ద సంఖ్యలో భక్తులు తీసుకువెళ్తుంటారని, అందుకు తగ్గట్టు లడ్డులు రుచికరంగా ఉండాలని సూచించారు. లడ్డూలను తయారుచేసే కైంకర్యపరులకు పలు సూచనలు చేశారు. నిత్యాన్నదాన పథకంలో భక్తులకు అందించే అన్నప్రసాదాన్ని పరిశీలించారు. భక్తులకు సంతృప్తి కలిగేలా పదార్థాలు తయారుచేయించాలని ఏఈవో పిల్లా శ్రీనివాసరావుని ఆదేశించారు.

దొరకని బాలిక ఆచూకీ



మాటూరి రూప(ఫైల్)

సబ్బవరం: అదృశ్యమైన బాలిక అచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని స్థానిక సీఐ పిన్నింటి రమణ మంగళవారం తెలిపారు. మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన మాటూరి రూప ఈ నెల 19 నుంచి కనిపించట్లేదని, దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రూప నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోందన్నారు. అదృశ్యమైన రోజున ఉదయం 8 గంటల సమయంలో స్కూల్‌కి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరి, రాత్రయినా ఇంటికి తిరిగిరాలేదన్నారు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇంట్లో ఆరా తీసినా, అచూకీ తెలియరాలేదు. దీంతో తండ్రి రామారావు ఈ నెల 22న చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు



పిన్నింటి రమణ, సీఐ, పరవాడ

సబ్బవరం: అనుమతి లేకుండా బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సబ్బవరం సీఐ పిన్నింటి రమణ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. లైసెన్స్ పొందిన దుకాణదారులు మాత్రమే బాణసంచా అమ్మకాలు జరపాలన్నారు. లైసెన్సు లేకుండా విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్సు కలిగిన దుకాణదారులు తమ స్టాళ్ల వద్ద తప్పనిసరిగా అగ్ని ప్రమాదాల్ని నిలువరించేందుకు నీరు, ఇసుక వంటి అగ్నిమాపక సామగ్రిని బాణసంచా స్టాళ్ల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. మైనర్లను బాణసంచా తయారీ, విక్రయ ప్రదేశాలకు దూరంగా ఉంచాలన్నారు. జనావాసాలకు, విద్యా సంస్థలకు, ఆస్పత్రులకు దూరంగా బాణసంచా విక్రయాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వలు ఉంటే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

మండలంలో 20 బాణసంచా విక్రయ స్టాళ్లకు రెవెన్యూ సిబ్బంది, ఇతర కార్యాలయాల ద్వారా అనుమతులిచ్చినట్లు తెలిపారు. మండల కేంద్రం సబ్బవరంలో 10 స్టాళ్లు, గ్రామీణ ప్రాంతం గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం వంటి ప్రాంతాల్లో మరో 10 స్టాళ్లకు అనుమతులిచ్చినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా వేరే ఏ చోట స్టాళ్లు ఏర్పాటు చేసినా, చర్యలు తీసుకుంటామన్నారు.

వీఎంఆర్‌డీఏ భూ సమస్య పరిష్కారానికి కృషి



వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న వేపగుంటలోని వీఎంఆర్‌డీఏ(వుడా) భూముల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు నగరంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి, సమస్య పూర్వాపరాలను వివరించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏళ్లతరబడి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, వేపగుంట రైతు ప్రతినిధులు గంట్ల దేముడు, సాలాపు రమణ, సేనాపతి దేముడు తదితరులున్నారు.

రెవెన్యూ సదస్సులో అర్జీలకు సత్వర పరిష్కారం



రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: గ్రామ రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలించి, రైతుల భూ సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని బంగారమ్మపాలెం శివారు ఎ.సిరసపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. పలు భూ సమస్యలపై రైతుల నుంచి 121 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. గ్రామంలో 114 సర్వే నెంబర్లలో 1,215.69 ఎకరాల భూములు ఉన్నట్లు వెల్లడించారు. సదస్సులో సర్పంచ్ దాడి లావణ్య, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్, మండల సర్వేయర్ లాలం అప్పారావు, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, అంగటి సూరిబాబు, దార రాము, శిలపరశెట్టి మల్లునాయుడు, దొడ్డి రాము, దొడ్డి రాజకోటి, వీఆర్వో నాగేశ్వరరావు, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు అవగాహన యాత్ర

సబ్బవరం: ఆక్రమణలకు గురవకుండా చెరువుల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు జలవనరుల పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు తెలిపారు. ఈ యాత్ర సబ్బవరం చేరడంతో సమితి సభ్యులు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఆక్రమణలకు, కబ్జాలకు గురైన చెరువుల పరిరక్షణ కోసం ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో పర్యటించి, జల వనరుల సంరక్షణకు సంబంధిత అధికారులను కలిసి విన్నవించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు గురుజీ భారతా నంద మహరాజ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు దేవిపల్లి సీతారాం, విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఐ.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని వినతి

పరవాడ: ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ జలాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఆయా పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని బీజేవైఎం నాయకులు మోసా రామకృష్ణ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరారు. నగరానికి విచ్చేసిన కేంద్ర మంత్రిని బీజేవైఎం నాయకులు మంగళవారం కలిసి మత్స్యకారుల సమస్యలపై వినతి పత్రం అందించారు. పరిశ్రమలు సముద్ర జలాల్లో విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాల కారణంగా మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. వీరికి ఎన్టీపీసీలో 60, ఫార్మాసిటీలో 100 ఉద్యోగాలను కల్పిస్తామని యాజమాన్యాలు ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుటేరులో ఎన్టీపీసీ వ్యర్థాలు చేరి చిరు చేపలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మత్స్యకారుల ఉపాధి సమస్య తెరపైకి తెచ్చి, ఆ తర్వాత మర్చిపోతున్నారని వాపోయారు. మంత్రిని కలిసిన వారిలో బీజేవైఎం నాయకులు మోసా రామకృష్ణ, వెన్నల నూకరాజు, బి.రాజశేఖర్, బి.రామునాయుడు, రాంప్రసాద్ ఉన్నారు.



బండి సంజయ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేవైఎం నాయకుడు రామకృష్ణ

జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

సబ్బవరం: స్థానిక ప్రతిభ విద్యాలయం విద్యార్థి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ మంగళవారం తెలిపారు. అండర్–17 విభాగంలో ఎంపికైన విద్యార్థి బలిరెడ్డి భరత్ వర్ధన్‌ను బోధన సిబ్బందితో కలిసి అభినందించారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో జరిగిన బాస్కెట్‌బాల్ స్టేట్ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, వచ్చే నెలలో చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ నెల 24న సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో అండర్–17 విభాగంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు తమ విద్యాలయానికి చెందిన 5గురు విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారిలో బి.భరత్ వర్ధన్, ఎం.జస్వంత్, జి.గీతాచంద్రిక, డి.సంజన, పి.జ్యోతి ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ ఆన్సీ జోసెఫ్, ఆదిరెడ్డి శరత్ తదితరులు ఉన్నారు.



బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన భరత్ వర్ధన్, ఇతర విద్యార్థులతో ప్రతిభ విద్యాలయం సిబ్బంది

పరిచారకుడిపై ఈవోకు ఫిర్యాదు

సింహాచలం: సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉన్న వంటశాల గదిని పెళ్లి బృందాలకు సామాన్లు భద్రపరిచే గదిగా మార్చేసిన పరిచారకుడిపై చర్యలు తీసుకోవాలంటూ హిందూ సమస్య పోరాట సభ్యురాలు మాధవీలత సింహాచలం ఈవో వి.త్రినాథరావును కోరారు. ఈ మేరకు పాత గోశాల వద్దనున్న ఈవో స్వగృహంలో మంగళవారం ఆయన్ని కలిసి, వినతిపత్రం అందించారు. ఇప్పటికీ ఆ గది అతని ఆధీనంలోనే ఉందన్నారు. కొన్ని నెలల కిందట ఆ పరిచారకుడిని కొండ దిగువనున్న పైడితల్లి ఆలయానికి బదిలీ చేసినా అక్కడ విధులు నిర్వర్తించకుండా కొండపైకి వచ్చి పెళ్లిళ్ల వ్యాపారం చేసుకుంటున్నాడని ఆరోపించారు. బీనామీ అర్చకుడిని నియమించుకుని ఆయన విధులకు గైర్హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కాశీవిశ్వేశ్వరస్వామి నివేదనకు ఆటంకం కల్గిస్తున్న సదరు అర్చకుడి నుంచి వంటశాల గదిని స్వాధీనం చేసుకుని, ప్రస్తుతం విధుల్లో ఉన్న అర్చకులకు అప్పగించాలని కోరారు.



ఈవోకు వినతిపత్రం అందిస్తున్న మాధవీలత

గురుకుల విద్యార్థులు భళా!

భవిష్యత్తు తమదేనని బాల మేధావులు చాటిచెప్పారు. మధురవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా 'ఫ్యూచర్ ఆన్-2024' పేరిట జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. జూనియర్ కేటగిరీ మ్యాథ్స్, సైన్స్, క్రాఫ్ట్స్, ఐసీటీ విభాగంలో నవీన ఆవిష్కరణలతో సబ్బవరం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి, అబ్బురపరిచారు. – సబ్బవరం



మ్యాథ్స్ విభాగంలో ప్రోపర్టీస్ ఆఫ్ ది సర్కిల్స్ నమూనాతో తనూజ, నిస్సీ



సైన్స్‌లో వెర్టికల్ ఫార్మింగ్ నమూనాతో శివకుమార్, నవదీప్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, గైడ్ టీచర్ రాంబాబు



క్రాఫ్ట్ విభాగంలో మున్న, సంపత్ వినయ్ రూపొందించిన క్రాఫ్ట్ గ్యాలరీతో గైడ్ టీచర్లు